పాదం చదవగానే దుఃఖం వచ్చింది. దానర్థం భగవంతుడు తన భక్తుల యోగక్షేమాలని తనే చూసుకుంటాడు అని. దైవం మీదే భారం వేసిన తనని ఆయన ఆ శ్లోకంలో చెప్పినట్లుగా ఆదుకోడే? కసిగా ఆ పదాన్ని ఎర్ర సిరాతో రెండుసార్లు కొట్టేసాడు కనకదాసు.

భిక్షకి వెళ్ళి ఆ రోజు కూడా ఉత్తచేతులతో తిరిగి వచ్చాడు. కాని భార్య అన్నం వడ్డించడం చూసి ఆశ్చర్యపోయిన కనకదాసు అడిగాడు.

"సంబారాలు ఎక్కడివి?"

"ఎవరో పదేళ్ళ నల్లటి కుర్రాడు తెచ్చాడండి. నేను ఓ చేతిని వేసి బస్తాని దింపేప్పుడు చూస్తే వాడి వీపు మీద రెండు ఎర్రటి వాతలు వున్నాయి. 'ఇది ఎవరి పని నాయినా?' అని నేనడిగితే అది మీ పనేనని చెప్పాడండి. ఆ కుర్రాడ్ని ఎందుకలా బాధించారు?" ప్రశ్నించింది భార్య.

కాసేపు అయోమయంలో పడ్డాడు కనకదాసు. ఏదో స్ఫురించడంతో భగవద్గీతని తెరచి తొమ్మిదో అధ్యాయంలోని ఆ ఇరవై రెండో శ్లోకం చూస్తే ఉదయం తను గీసిన రెండు ఎర్రటి గీతలు వహామ్యహమ్ పదం మీద మాయం అవడం గమనించాడు.

## 186. వాచీ పాఠం

ఓ అమ్మాయి తండ్రి బ్రహ్మచారైన ఓ ధనవంతుడికి తన కూతుర్ని ఇచ్చి వివాహం చెయ్యాలని ప్రయత్నించసాగాడు. తల్లి ద్వారా ఆ సంగతి తెలిసిన ఆ కూతురు తండ్రితో చెప్పింది.

"నాకతన్ని చేసుకోవడం ఎంతమాత్రం ఇష్టం లేదు. అతను అవినీతి పరుడు కాబట్టే అంత ధనవంతుడయ్యాడు."

అయినా తండ్రి తన మాట వినిపించుకోకపోవడంతో ఆమె తండ్రికి ఆ విషయం గట్టిగా చెప్పాలనుకుంది. తన నగలు అమ్మి ఆమె ఓ వజ్రాల

వాచీని కొని తండ్రికి బహుకరించింది. అయితే ముందుగా అది తప్పు టైం చూపించేలా తగిన మార్పు చేయించింది. అది చూపించే తప్పు టైంకి విసుగొచ్చి ఓ రోజు దాన్ని చేతి నించి విప్పతీసి కూతురుకి తిరిగి ఇచ్చేస్తూ విసుగ్గా చెప్పాడు.

"ఇది నాకు ఒద్దు."

"ఇంత ఖరీదైంది ఎందుకు వద్దు?" ప్రశ్నించింది కూతురు.

"తప్పు టైం చూపించేది ఎంత ఖరీదైంది అయినా సరే, దానివల్ల నష్టం తప్ప లాభం లేదు కాబట్టి."

"ఎంత ధనవంతుడైనా అధర్మం గలవాడు ఈ వాచీలాంటి వాడే నాన్నా. వాచీ సరైన టైంని చూపించడానికి నిర్దేశింపబడ్డట్లుగానే, మనిషి ధర్మంగా జీవించడానికి బద్ధుడై వుండాలి. లేకపోతే తప్పు టైం చూపించే వాచీలా మృగ లక్షణాలున్న అతన్ని ఏదో ఓ రోజు వదిలించుకోవాల్సి వస్తుంది."

కూతురు మాటలు వినగానే తన తప్పు గ్రహించి ఆ పెళ్ళి ప్రయత్నాలని ఆపు చేసి తన కూతుర్ని ఓ ధర్మాత్ముడికి ఇచ్చి ఆ తండ్రి వివాహం చేసాడు.

## 187. దా'సోహం'

ఒకతను పొద్దున్నే లేచి ఇందిరా పార్క్‌లో నడుస్తూంటే, దాని కాంపౌండ్ వాల్ లోపల అడ్డ బొట్టు పెట్టుకున్న ఒక శివ భక్తుడు 'సోహం' అని రాయడం చూసాడు. దానర్థం ఏమిటని అతని దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"సోహం అంటే అద్వైత మతం. మనం గాలిని 'సో' అంటూ పీల్చి, 'హం' అంటూ వదులుతాం. ఆ శ్వాస మీద పెట్టే ధ్యాసనే 'సోహం' అంటారు. దీనివల్లే మనం తరిస్తాం." ఆ సాధువు వివరించాడు.

అతనటు వెళ్ళగానే నిలువు బొట్లు పెట్టుకున్న ఇంకో సాధువు వచ్చి దాన్ని చూసి, జేబులోంచి చాకపీస్‌ని తీసి సోహం ముందు 'దా' అనే అక్షరాన్ని